RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 03 సంచిక : 364 మంగళవారం 16-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## మంచి చేశాం.. మళ్ళీ వస్తాం...

### ఇది నిజం కాదా?

దశాబ్దాలుగా జరగని కర్నూలు నగర ప్రజల తాగునీటి సమస్యకు కేవలం మూడేళ్లలో శాశ్వత పరిష్కారం. ఒక్క నీళ్ళ సమస్య పరిష్కారానికే రూ.230 కోట్లు కేటాయింపు.వ్యత్యాసం గమనించండి????స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి బి.వై. రామయ్య గారు బాధ్యతలు చేపట్టిన నాటికి నగర ప్రజల తాగునీటికి సంబంధించిన నీటి శుద్ధి కేంద్రం యొక్క సామర్థ్యం – 88.5 ఎంఎల్‌డిలు బి.వై. రామయ్య గారి సారథ్యంలో పాలకవర్గం ఏర్పడిన కేవలం మూడేళ్లలో శ్రీకారం చుట్టిన రెండు ప్రాజెక్టుల యొక్క సామర్థ్యం – 65 ఎంఎల్‌డిలుదీనిని బట్టి కర్నూలు జిల్లా నుంచి దశాబ్దాలుగా మంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్రమంత్రులుగా పనిచేసినా వారంతా జిల్లా కేంద్రానికి ఎం చేశారో ప్రజలు గ్రహించాలి...గత మూడేళ్లలో జిల్లా పర్యటనలకు వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిని ఎమ్మెల్యేలతో కలిసి బి.వై. రామయ్య గారు పలుమార్లు నీటి సమస్యను ముఖ్యమంత్రికి వివరించి, విజ్ఞప్తి చేసి, ఆపై అధికారులపై ఒత్తిడి తెచ్చి నగర నీటి సమస్య పరిష్కారానికై ఇప్పటివరకు చేపట్టినా చర్యలు...???? మునగాలపాడు వద్ద 15 కోట్లతో 15 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఇప్పటికే దిగ్విజయంగా పూర్తి.? రూ.82 కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు ఎస్.ఎస్.


## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386  85220 22029

Land Line No : 08517 224194


# గత పదేళ్ల ఎన్డీయే పాలన ట్రైలర్ మాత్రమే..
# ఇంకా చేయాల్సింది చాలా ఉంది : ప్రధాని మోదీ

ఢిల్లీ:దేశంలో గత పదేళ్ల ఎన్డీయే పాలన పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ పదేళ్ల పాలనలో చూసింది కేవలం ట్రైలర్ మాత్రమేనని అన్నారు. ఇంకా చేయాల్సింది ముందు ముందు చాలా ఉందన్నారు. సోమవారం కేరళ



రాష్ట్రంలోని కున్నంకుళం లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని పాల్గొని మాట్లాడారు. కేరళతోపాటు దేశ ప్రగతికి చేయాల్సింది చాలా ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'గత పదేళ్లలో జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే. కేరళ సహా భారత్ కోసం చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అని అన్నారు.ఇక ఇదే సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ పేరును ప్రస్తావించకుండా ''కాంగ్రెస్ యువరాజు' తన కుటుంబ గౌరవాన్ని కాపాడుకోలేకపోయారు. యూపీలో తన కుటుంబానికి చెందిన స్థానాన్ని కాపాడుకోలేక మౌనంగా ఉన్నారు (ఏళ్ల తరబడి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అమేథీ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఉద్దేశిస్తూ). అయితే, కేరళ ప్రజల ప్రయోజనాల కోసం గొంతెత్తని ఆయన ఓట్లు మాత్రం అడుగుతాడు' అంటూ రాహుల్‌పై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇక ఈ ఎన్నికల్లోనూ బీజేపీ కూటమిని ఆశీర్వదించాలని ఓటర్లను మోదీ అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు.

# ఆదరణ చూసి ఓర్వలేక దాడులు



### ప్రజాశీర్వాదంతో ప్రాణాలతో బయటపడ్డా
### ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు
### మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే
### ఒకరోజు విశ్రాంతి తరవాత బస్సుయాత్ర ప్రారంభం
### కేసరపల్లి వద్ద ఆతర ప్రారంభించిన జగన్
### భారీగా తరలి వచ్చి పరామర్శించిన నేతలు

విజయవాడ,ఏప్రిల్15 : బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూసే దాడులు చేస్తున్నారని,రాయి దాడి ఘటనపై సీఎం జగన్ తొలిసారి స్పందించారు. విజయవాడ సమీపంలోని కేసరపల్లి వద్ద తనను కలిసిన కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. బస్సు యాత్రకు వస్తున్న ఆదరణ చూసే దాడులు చేస్తున్నారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రాణాపాయం తప్పిందని, మరోసారి అధికారంలోకి వస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. తనను ఎలాంటి దాడులు ఆపలేవన్నారు. ప్రజల మద్దతుతో మరింత ముందుకెళ్తానన్నారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని జగన్ చెప్పారు. ధైర్యంతో ముందడుగు వేద్దామని కార్యకర్తలతో పేర్కొన్నారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం తమకు ఉన్నాయన్నారు. ప్రజల ఆశీస్సులతోనే దాడి నుంచి తప్పించుకోగలిగానని తెలిపారు. ఒకరోజు విరామం తరువాత సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రను కొనసాగించారు. నవరత్న పథకాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగిందనీ, ప్రజల ఆశీర్వాదం ఉన్నాయని, ధైర్యంగా అడుగులు ముందుకేద్దామని వైసిపి అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అన్నారు. విజయవాడలో రాయి దాడి తర్వాత డాక్టర్ల సూచనతో ఒకరోజు విశ్రాంతి తర్వాత బస్సు యాత్రను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. గాయమైన జగన్‌ను పరామర్శించేందుకు కేసరపల్లి క్యాంపునకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిపై హత్యాయత్నం ఘటనపై తీవ్ర విచారం వ్యక్తంచేశారు. వైసిపి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, బస్సు యాత్రకు వస్తున్న విశేష ఆదరణచూసి తట్టుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డారని ముఖ్యమంత్రితో అన్నారు. ప్రజల ఆశీర్వాదం వల్లే అదృష్టవశాత్తూ ఈ దాడి నుంచి సీఎం తప్పించుకున్నారన్నారు. ఉన్నాయని నాయకులతో అన్నారు. ధైర్యంగా అడుగులు ముందుకేద్దామన్నారు. కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ ఛైర్మన్ అహ్మద్ హుస్సేన్, టిడిపి అధికార ప్రతినిధి ముస్తఫా మోమిన్, కర్నూలు జిల్లా తాలిమియా బోర్డు అధ్యక్షులు ముఫ్తీ నూర్ మహ్మద్, మహ్మద్ ఇలియాస్ వైసిపిలో చేరారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి (వైసిపి) వారిని స్వాగతించగా సిఎం వైసిపి కండువాలు వేసి ఆహ్వానించారు. ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి సీనియర్ నాయకుడు చిరుమామిళ్ల శ్రీనివాసరావు (అలియాస్ బుజ్జి), నందిగామ ఎఎంసి మాజీ చైర్మన్ వ్డడెలి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఛైర్మన్ వై.రామారావు, గోడపాటి బూరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ కరీముల్లా, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ అధ్యక్షురాలు డాక్టర్ షేక్ హసీనా, కొమ్ము విజయరాజు చేరారు. ఎంపి కేశినేని శ్రీనివాసరావు (నాని), నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గన్నారు. పెనమలూరు నియోజకవర్గ టిడిపి నేతలు దేవినేని గౌతమ్, చలసాని పండు కుమార్తె చలసాని స్మిత, బిసివై పార్టీ నుంచి కె.ఉమావల్లియాదవ్, మాదిగ హక్కుల కమిటీ ఫౌండర్ గురివిందపల్లి చిట్టిబాబులు వైసిపిలో చేరారు. వీరిని మంత్రి జోగి రమేష్ ఆహ్వానించారు.వైసిపి శ్రేణుల సందడికేసరపల్లి నుంచి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు గన్నవరంలో వేలాది మంది ఘనస్వాగతం పలికారు. యువకులు, మహిళలు సందడి చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఆధ్వర్యంలో గన్నవరం, ఉంగుటూరు మండలాల నుంచి వాహనాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున గన్నవరం తరలించారు. గాంధీ బమ్మ సెంటర్లో జన సందోహం కనిపించిది.

# ఎక్కడ నింద తమపైకి వస్తుందోనని టీడీపీ భయపడుతోంది: సజ్జల



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయని అన్నారు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి.సీఎం జగన్‌పై జరిగిన దాడిని భద్రతా వైఫల్యం అంటున్న టీడీపీ నేతలు, ఏం వైఫల్యమో చెప్పడం లేదని మండిపడ్డారు. ఎక్కడ నింద తమపైకి వస్తుందోనని టీడీపీ భయపడుతోందన్నారు. ఎవరైనా వారిపై వారే దాడి చేయించుకుంటారా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో అడ్రస్ గల్లంతవుతుందని భయపడుతున్నారన్నారు.సీఎంపై జరిగిన దాడిపై ప్రతిపక్షాలన్నీ ఒకేలా మాట్లాడుతున్నాయన్నారు సజ్జల. సీఎంపై దాడి జరిగితే డ్రామా అనడం సరికాదని హితవు పలికారు. వైఎస్ జగన్‌కు నాటకాలు, డ్రామాలు అడటం రాదని తెలిపారు. చంద్రబాబు దాడిని ఖండిస్తున్నామంటూనే డ్రామాలు అంటున్నారని మండిపడ్డారు. అసలు ఏం మాట్లాడుతున్నాడో పవన్‌కే అర్థం కావడం లేదని దుయ్యబట్టారు.'ప్రతిపక్షాలకు పుట్టగతులుండవని అర్థమైంది. డ్రామాలాడేవారైతే గాయాన్ని ప్రజలకు చూపించేవారు. గతంలో గానీ, ఇప్పుడు గానీ జనాలకు గాయాన్ని చూపించలేదు. డ్రామాలంటున్న వారెవరైనా రాయితో కొట్టించుకోగలారా? విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రతిపక్షాలు ప్రయతిస్తున్నారు. పవన్ కత్తితో పొడిపించుకుంటాడా? రాయితో కొట్టించుకుంటాడా? ప్రతిపక్షాల విమర్శలను వాళ్ల విచక్షణకే వదిలేస్తున్నాం' అన్నారు సజ్జల

# రాళ్లు వేయించుకునే అలవాటు బాబుకు ఉండొచ్చు: బొత్స



విశాఖపట్నం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే ఘన విజయం సాధిస్తుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు.లోపాయికారీ ఒప్పందాలు చేస్తున్నది టీడీపీనే అని మండిపడ్డారు. 'స్టీల్ ప్లాంట్ కోసం టీడీపీ ఏరోజైనా మాట్లాడిందా?. స్టీల్ ప్లాంట్ కోసం చిత్తశుద్ధితో ఉన్నది వైఎస్సార్‌సీపీ. చంద్రబాబు గాజువాకలో ఏం మాట్లాడారో ఆయనకే తెలీదు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు... ప్రజలకు అంతా తెలుసు. రాజకీయాల కోసం చంద్రబాబు దిగజారి మాట్లాడుతున్నారు.సీఎం జగన్‌పై దాడి జరిగితే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. డ్రామాలు, నటించడం చంద్రబాబుకు బాగా తెలుసు. సీఎం వైఎస్ జగన్ యాక్టర్ కాదు.. జగన్ రియల్ హీరో. రాళ్లు వేయించుకునే అలవాటు చంద్రబాబుకు ఉండొచ్చు. మేం ఎవరికీ ఏదీ ఆపాదించం.. కానీ జగన్‌పై కుట్ర ప్రకారమే దాడి జరిగింది. పవన్ కల్యాణ్‌క ఏం తెలుసు?. పవన్ వ్యవస్థల గురించి తెలుసుకొని మాట్లాడాలి. జగన్‌పై దాడి జరిగితే పార్టీలకతీతంగా ఖండించారు. చంద్రబాబు, పవన్ మాత్రం వెటకారంగా మాట్లాడారు.చంద్రబాబు సైకిల్ ?బాగుందా? ఎప్పుడో తుప్పు పట్టిపోయింది. పవన్ డొల్లతనం ఆయన మాట?ల్లోనే తెలిసిపోతోంది. చంద్రాబాబు 14 ఏళ్లలో రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించారు. ప్రజలకు ఏం చేశారో చంద్రబాబు చెప్పగలరా? వాలంటీర్లపై చంద్రబాబు అవాకులు, చవాకులు మాట్లాడారు. ఇప్పుడు తానొస్తే వాలంటీర్లకు జీతం 10వేలు చేస్తానంటున్నాడు' అని మంత్రి బొత్స మండిపడ్డారు.

# సుప్రీంలోనూ కేజ్రీకి దక్కని ఊరట

### అరెస్టుపై విచారణ 29కి వాయిదా
### సమాధానం ఇవ్వాలంటూ ఇడికి నోటీసులు

న్యూఢిల్లీ,ఏప్రిల్15, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులోనూ నిరాశే ఎదురైంది. కేజ్రీవాల్‌కు అత్యున్నత న్యాయస్థానంలోనూ ఊరట లభించలేదు. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. ఈ అరెస్ట్ ఛాలెంజ్ పిటిషన్‌ను ఏప్రిల్ 29న విచారిస్తానని జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం స్పష్టం చేసింది. అదే సమయంలో కేజ్రీవాల్ అరెస్టుపై ఈడీకి నోటిసులు జారీ చేసింది సుప్రీం ధర్మాసనం. ఏప్రిల్ 24వ తేదీ లోపు సమాధానం చెప్పాలని ఈడీని ఆదేశించింది సుప్రీంకోర్టు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేయాలంది. ఈడీ అరెస్ట్, ట్రయిల్ కోర్టు కస్టడీని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు.. కూడా తన అరెస్టును వ్యతిరేకిస్తూ రౌస్ అవెన్యూ కోర్టులో, ఢిల్లీ హైకోర్టులో సైతం పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను రెండు కోర్టులు తిరస్కరించగా.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం విచారణను తరువాత చేస్తానని చెప్పింది. దీంతో కేజ్రీవాల్ మరికొన్ని రోజులు జైల్లో ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదిలాఉంటే.. ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం కేజ్రివాల్‌కు ఏప్రిల్ 23వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించింది రౌస్ అవెన్యూ కోర్టు. కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. దీంతో ఆయన్ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు.

# ఇంటర్ విద్యార్థులకు అలెర్ట్

### మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు...

విజయవాడ, ఏప్రిల్ 15 ,పీలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు వివరాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల థియరీ పరీక్షలు రాయదల్చినవారు రూ.550 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పరీక్ష ఫీజు రూ.550తోపాటు ఒక్కో పేపర్‌కు రూ.160 చొప్పున అదనంగా చెల్లించాలని బోర్డు పేర్కొంది. అదేవిధంగా బ్రిడ్జికోర్సు పేపర్లు రాసేందుకు రూ.150 చెల్లించాలని సూచించింది. ఇక ప్రాక్టికల్స్ పరీక్ష ఫీజును రూ.250గా నిర్ణయించారు. పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు హాజరుకావాల్సినవారు ఈ మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఏప్రిల్ 18 నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటన విడుదల చేసింది. ఇక జవాబు పత్రాల రీవెరిఫికేషన్‌కు రూ.1,300, రీకౌంటింగ్‌కు రూ.260 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 1 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ప్రతిరోజు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్‌లో ఫెయిల్ అయినా విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు, విద్యార్థులు ఏదైనా సబ్జెక్టులో మార్కులు తక్కువగా వస్తే ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసుకోవచ్చు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 1 వరకు థియరీ పరీక్షలు నిర్వహించనుండగా.. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాలేకపోయిన విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూలును ప్రకటించారు. మే 1 నుంచి 4 వరకు సంబంధిత జిల్లా కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో సందేహాలున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఏప్రిల్ 18 నుంచి 24 వరకు నిర్ణీత మొత్తంలో ఫీజు చెల్లించి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేసుకోవచ్చు. రీకౌంటింగ్ ద్వారా మరోసారి మార్కుల మూల్యాంకనం, రీవెరిఫికేషన్ ద్వారా జవాబుపత్రాల స్కానింగ్ కాపీలు, జవాబుపత్రాల వెరిఫికేషన్ కోరవచ్చు.ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ 12న విడుదలైన సంగతి తెలిసిందే. ఫలితాలకు సంబంధించి ఇంటర్ ఫస్టియర్‌లో 67 శాతం, సెకండియర్‌లో 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో జనరల్ విభాగంలో ప్రథమ సంవత్సరం నుంచి 4,61,273 మంది పరీక్షలకు హాజరుకాగా.. వీరిలో 3,10,875 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 67 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇక ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలకు సంబంధించి 3,93,757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 3,06,528 మంది పరీక్షలో అర్హత సాధించారు. మొత్తం 78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

# మండే ఎండల్లో చల్లచల్లని కూల్ న్యూస్..

### ఈసారి వర్షాలే వర్షాలు..

సూరీడు దంచికొడుతున్నాడు.. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ ఏడాది మార్చి నుంచే భానుడు నిప్పులు కురిపిస్తూ మంటలు రేపుతున్నాడు. ఉదయం 10 గంటల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందంటే.. భానుడి ప్రతాపం ఎలా ఉందో మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. తెలుగు రాష్ట్రాలే కాదు.. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 45 డిగ్రీలు దాటాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. మే, జూన్ నెలల్లో ఉ



ష్ణోగ్రతలు 50 డిగ్రీలకు దగ్గర నమోదవుతాయన్న వాతావరణ శాఖ అంచనాలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐఎండీతోపాటు.. అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి సైతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జాగ్రత్తగా ఉండాలంటూ సూచించింది. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో రాబోయే నెలల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని.. దాదాపు 25 కోట్ల మంది చిన్నారులకు భానుడి నుంచి ముప్పు పొంచి ఉందని.. జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచనలు చేసింది..ఈ క్రమంలోనే.. భారత వాతావరణ శాఖ (ఎఓఆ) రుతుపవనాలపై చల్లటి కబురు అందించింది. దేశంలోకి ఈసారి నైరుతి రుతుపవనాలు సమయానికి కంటే ముందే రావచ్చని అంచనా వేసింది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఈ సారి వర్షపాతం ఎక్కువగానే.. అంటే 106 శాతానిపైగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. హిందూ మహాసముద్రం డైపోల్, లా నినా పరిస్థితులు ఒకే సమయంలో చురుకుగా మారడంతో రుతుపవనాలు త్వరగానే వస్తాయని వాతావరణ నిపుణులు అంచనావేశారు.

# ఎవరికి లాభం...ఎవరికి నష్టం

కడప, ఏప్రిల్ 15,ఎన్నికలవేళ జగన్మోహన్ రెడ్డి లాంటి నాయకుడికి ఏదైనా జరిగితే దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయి. పైగా ఏపీలో కుల రాజకీయాలు ఎక్కువ కాబట్టి ఇవి దేనికైనా దారి తీసే ప్రమాదం ఉంది.. అయితే ఈ దాడి ఎవరు చేశారు? ఎందుకు చేశారు? వారి లక్ష్యం ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రస్తుతానికి సమాధానం లభించకపోయినప్పటికీ.. దీని తర్వాత జరిగే పరిణామాల ఆధారంగానే ఏపీ రాజకీయాలు ఆధారపడి ఉంటాయి. ఒక రాజకీయ నాయకుడిని మరొక రాజకీయ నాయకుడు విమర్శిస్తే పెద్దగా ఇబ్బంది ఉండదు. పైగా ఇప్పుడు రాజకీయాలు ఏకంగా వ్యక్తిగత విషయాలు దాకా వెళ్లాయి. ఏపీలో అయితే మరీ దారుణం. కానీ భౌతిక దాడులను ఎవరూ హర్షించరు. ఎందుకంటే నచ్చినా, నచ్చకున్నా ఒక మనిషిపై ఇంకొక మనిషి భౌతిక దాడి చేయడం అనేది సహేతుకం కాదు.జగన్ పై దాడి జరిగిన నేపథ్యంలో.. దానిని ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయంగా వాడుకుంటే మాత్రం అంతకుమించిన రాజకీయ దారిద్రం మరొకటి ఉండదు. ఎందుకంటే ఏపీలో ప్రస్తుతం అధికారంలో ఉన్నది వైసిపి.. ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నది జగన్మోహన్ రెడ్డి. ఒక ముఖ్యమంత్రి కి భద్రత కల్పించలేని పోలీసులు.. సామాన్యులకు ఎలా కల్పిస్తారు? ముఖ్యమంత్రి పర్యటన సాగుతున్నప్పుడు ఆ ప్రాంతంలో కరెంటు ఎందుకు తొలగించారు? ముఖ్యమంత్రి బస చేసిన బస్సు వద్దకు ఎందుకు ఒకసారి జనాన్ని అనుమతించారు? ఇలాంటి ప్రశ్నలకు సహజంగానే సమాధానం లభించాల్సి ఉంటుంది. ఎందుకంటే బస్సు యాత్ర చేస్తున్న వ్యక్తి సామాన్యుడు కాదు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి. పైగా ఇప్పుడు ఎన్నికల కాలం.. అలాంటప్పుడు పై ప్రశ్నలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు తీసుకెళ్తాయి.. ఇలాంటి సమయంలో పార్టీ శ్రేణులు సమయమనం పాటించాలి. అన్నింటికీ మించి భావోద్వేగాలు రెచ్చగొట్టకుండా అధికార పార్టీ నాయకులు నిశ్శబ్దాన్ని అనుసరించాలి.ఇక ఈ దాడి రాజకీయంగా జగన్ కు నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే గత ఎన్నికల్లో జగన్ పై కోడి కత్తి దాడి జరిగింది. ఇంతవరకు ఆ కేసు సంబంధించి విచారణ లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పైగా అదే ఎన్నికల్లో వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు గురయ్యారు. ఇప్పుడు సహజంగానే ఈ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి కూతురు జగన్ పై విమర్శలు చేస్తున్నారు. జగన్ సొంత సోదరి షర్మిల కూడా ఆరోపణలు చేస్తున్నారు. సరే అవి వారి ఇంటి విషయాలు కాబట్టి పక్కన పెట్టినా.. శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడి ని సానుభూతి అంశంగా జగన్ ఒకవేళ ప్రజల్లోకి తీసుకెళ్తే అది నష్టం చేకూర్చే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. '' దాడి జరిగింది నిజమే. జగన్ గాయపడ్డారు. కన్ను రెప్ప పై భాగం కొంచెం వాచింది. దీని వెనుక ఎవరు ఉన్నారు? వారి లక్ష్యం ఏమిటి? అసలు ఎందుకు ఇలా చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది.. ఆ తర్వాత అసలు విషయాలు ప్రజలకు అర్థం అవుతాయి. ఒకవేళ జగన్ బాధిత పక్షం లాగా ప్రజలకు కనిపిస్తే కచ్చితంగా ఓట్లు వేసి గెలిపిస్తారు. అదే వేరే విధంగా అనిపిస్తే అప్పుడు వారు అదే ఓటుతో బుద్ధి చెబుతారు.. అప్పటిదాకా సమయమనం అనేది చాలా ముఖ్యం" అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రేమ పేరుతో బ్లాక్ మెయిల్

## పోలీసుల అదుపులో నిందితుడు

చిత్తూరు ,చిత్తూరు జిల్లా పలమనేరు లో ఇంజనీరింగ్ విద్యార్థిని ప్రేమ పేరుతో బ్లాక్ మెయిల్ చేసి బెదిరించి ఆమె బాత్ రూం వీడియోలు తీసి ఆమె పై రేప్ చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసారు. గంగవరం మండలంకు చెందిన విద్యార్థి గంగవరం మండలం లోని ఒక ప్రవేట్ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఐవఇ 2 ఎవజీతీ చదువుతున్నది. అమే ను 6 నెలల క్రితం బైరెడ్డిపల్లి మండలానికి చెందిన అజయ్ కుమార్ అనే అతను బెంగుళూర్ లో ప్రవేట్ జాబ్ చేస్తు అతనికి పరిచయం ఉన్న ఫ్రెండ్ ద్వారా పరిచయం లయ్యాడు. చాటింగ్ చేస్తూ ఆ చాటింగ్ లను రికార్డు చేసాడు. ముల్బాగల్ లో లాడ్జి రూం కి తీసుకెళ్ళి అక్కడ అమ్మాయికి తెలియకుండా ఆమె వీడియోలు తీసాడు. అమ్మాయికి నెల క్రితం వేరే అబ్బాయితో ఎంగేజ్మెంట్ కుదిరింది. అది తెలుసుకొని అబ్బాయి అమ్మాయి పరువు తీయాలని ఆమె అసభ్యకరమైన వీడియోలు వాట్స్ అప్ లో అమ్మాయికి వారి బంధువులకు పోస్ట్ చేయడం తో బాధితురాలు అవమానం తో ఆత్మహత్యాయత్నం రేసింది. విషయం తెలుసుకున్న ఆమె అన్న ఆమెకు ధైర్యం చెప్పి స్థానిక పోలీసులకు పిర్యాదు చేయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు అతనిని అరెస్ట్ చేసి పలమనేరు కోర్టులో అతనికి 15 రోజుల రిమాండ్ విధించారు

# ప్రచారం లో ముందంజలో టీడీపీ

శ్రీశైలం ,శ్రీశైలం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు కోలుకోలేని ఎదురు దెబ్బలు తగులుతున్నాయి, శ్రీశైలం నియోజకవర్గం శ్రీశైలం మండలంలో సూపర్ సిక్సర్ మాదిరిగా టిడిపి ప్రజల్లోకి దూసుకుపోతుంది గత మూడు రోజులుగా శ్రీశైలం మండలంలో వందలాది మంది వైసిపి పార్టీని వీడి టీడిపికి వలసల పర్వం కొనసాగుతుంది. శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. శ్రీశైలం మండలం సున్నిపెంటలోని వైసిపి ముఖ్య నేతలు తమ కార్యకర్తలతో భారీ ర్యాలీలు నిర్వహించి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. సున్నిపెంటలోని వైసిపి సీనియర్ నాయకుడు తనయుడు ఆసాది ప్రవీణ్ తేజ ఆద్వర్యంలో సుమారు వంద కుటుంబాలు టీడిపిలో చేరారు రాత్రి పది గంటల వరకు పార్టీలోకి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పార్టీ కండువాలు ఆహ్వానం పలుకుతూనే ఉన్నారు.ఒక్కరోజే శ్రీశైలం మండలం సున్నిపెంటలో సుమారు నాలుగు వందలమంది వైసిపి కార్యకర్తలు ఆ పార్టీ వీడి తెలుగుదేశం పార్టీలా చేరడం ప్రభంజనంలా పసుపు జండాలతో కొత్త రూపం దాల్చుకుంది శ్రీశైలం నియోజకవర్గంలో అభివృద్ధి పదం వైపు నడిపిస్తానని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి స్దానికులకు హామి ఇచ్చారు.శ్రీశైలం మండలాన్ని పూర్తి స్దాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పడంతో ప్రజలు కేరింతలతో హోరెత్తించారు గత మూడు రోజులుగా శ్రీశైలం మండలంలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసల పర్వం కొనసాగుతుంది.

## కుప్పం మీదుగా బెంగళూర్ వెళ్ళే రైళ్లు ఆలస్యం

చిత్తూరు వాణీయంబాడి సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దాంతో కుప్పం మీదుగా బెంగళూరు వెళ్ళే పలు రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఎప్పుడు రైలు వస్తుందో తెలిదని రైల్వే శాఖ అధికారులు సమాచారం. తిరుపతి నుండి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్ళే ఇంటర్సిటీ వానియంబాడిలో, చెన్నై నుండి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్ళే లాల్బాగ్ రైలు వలతూర్ రైల్వే స్టేషన్ లో రైల్వే శాఖ ఆపేసారు. యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టారు. రైళ్లు ఆలస్యం కావడంతో కుప్పం రైల్వే స్టేషన్ లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.

# సానుభూతి మంత్రం...ఎంత వరకు...

విజయవాడ, ఏప్రిల్ 15 ఇటీవల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాకర్ పై నడుస్తుండగా కింద పడ్డారు. నుదుటికి గాయమైంది.. అలా కారుతున్న రక్తంతోనే ఆమె ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందారు. ఆ తర్వాత వెళ్ళిపోయారు.. ఆ ఘటనకు కారణమేంటి అనేది ఇంతవరకూ బయటకు రాలేదు.. ఒక ముఖ్యమంత్రి స్థాయి మహిళ అలా గాయపడటం.. రక్తం కారుతుంటే అలా తీసుకురావడం అనేది ఈ సోషల్ మీడియా కాలంలో ఒకింత ''నటన''లాగే కనిపించిందని ఆరోపణలు వినిపించాయి. అంతకుముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కాలికి కట్టుకట్టుకొని ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో ఆమె గెలిచారు..ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి పై కోడి కత్తితో ఓ యువకుడు దాడి చేశాడు. అప్పట్లో రాజకీయంగా అది సంచలనం సృష్టించింది. ఏపీ పోలీసుల మీద, అక్కడి వ్యవస్థ మీద నమ్మకం లేక జగన్ మోహన్ రెడ్డి హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందారు. జగన్ పై జరిగిన దాడిని రాజకీయ కోణంలో టాకిల్ చేయలేక టిడిపి బోర్లా పడింది. ఆ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలిచారు. అయితే ఇంతవరకు ఆ కేసు కు సంబంధించి ఎటువంటి పురోగతీ లేదు. ఈ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పటికీ ఆ కేసు లో అతీగతీ తేలకపోవడం గమనార్హం.ఇక అంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎన్నికల సమయంలో అలిపిరి బాంబు బ్లాస్ట్ జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో చంద్రబాబు ప్రయాణించారు కాబట్టి ప్రాణాపాయం తప్పింది. కానీ ఆ ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఓటమిపాలైంది. వరుసగా కరువు, ప్రభుత్వపరంగా అంతంతమాత్రంగానే చర్యలు ఉండటంతో ప్రజలు కసితో కాంగ్రెస్ కు ఓటు వేశారు. ఏకంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని రెండుసార్లు గెలిపించారు.ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి రాజకీయాల్లో సానుభూతి అనే అంశం ఇవాల్టిది కాదు. నాడు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు తరఫున ఉన్న ఎమ్మెల్యేలు చెప్పులతో దాడి చేశారు. అప్పట్లో ఆయన బాధిత పక్షంగా ఉన్నారు. ఇవాల్టికి సీనియర్ ఎన్టీఆర్ మీద సానుభూతి వ్యక్తం అవుతుందంటే దానికి కారణం ఆ దాడే. మన సమాజంలో సానుభూతిని మించిన ఆయుధం మరొకటి లేదు. ఎన్నికల సమయంలో దానిని దొరకబుచ్చుకునేందుకు రాజకీయ నాయకులు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే ఈ ప్రయత్నాలలో కొంతమంది మాత్రమే విజయవంతమవుతారు.అలిపిరి బాంబు బ్లాస్ట్ జరిగినప్పుడు దానిని సానుభూతిగా వాడుకునేందుకు చంద్రబాబు ప్రయత్నించారని ఆరోపణలు ఉన్నాయి . కానీ ఆ ఎన్నికల్లో ఆ సానుభూతి మంత్రం పనిచేయలేదు. అంతిమంగా "చంద్రబాబు మాకేం చేశారు" అనే కోణంలోనే ప్రజలు ఆలోచించారు. అందువల్లే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. ఇక పశ్చిమ బెంగాల్లో గత ఎన్నికల్లో మమతా బెనర్జీ కాలుకు కట్టు కట్టుకొని ప్రచారం చేశారు. అప్పట్లో జనం దానిని నమ్మారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆమె అదే ట్రిక్ ప్లే చేసేందుకు ప్రయత్నాలు చేశారనే విమర్శలున్నాయి. అయితే అవి ఎంతవరకు ఫలితాన్ని ఇస్తాయి అన్నది మరి కొద్ది రోజుల్లో చూడాలి.ఇక ఏపీ విషయానికొస్తే శనివారం రాత్రి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై దాడి జరిగింది. వైయస్ జగన్మోహన్ రెడ్డి పై దాడి జరగడం ఇది తొలిసారి కాదు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయనపై కోడి కత్తి దాడి కూడా జరిగింది. అప్పట్లో ఆ ఎన్నికల్లో ఆయన 151 సీట్లతో గెలుపొందారు. యాదృచ్ఛికంగా ప్రస్తుత ఎన్నికల ముందూ ఆయన పై దాడి జరిగింది. అయితే ఈ దాడిని ప్రతిపక్ష నాయకులు, ఓ వర్గం నాయకులు సానుభూతి పెంపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. "నాడు కోడి కత్తి దాడి జరిగినప్పుడు ఇక్కడి పోలీసుల మీద, ఇక్కడి వ్యవస్థ మీద నాకు నమ్మకం లేదన్నారు. వెళ్లి హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇప్పుడు ఆయనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. పైగా పోలీస్ వ్యవస్థ మొత్తం ఆయన చేతిలోనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లోనే ఆయనపై దాడి జరిగింది. మరి ఇప్పుడు కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోవాలి కదా.. అంటే ఈ దాడిని కూడా ఎన్నికల్లో సానుభూతి అంశంగా వాడుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు" అంటూ టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు.ఇక వైసిపి నాయకులు చెబుతున్న కోణం మరో విధంగా ఉంది. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి.. సీట్ల పంపకాలు చేసుకున్నప్పటికీ గెలిచే పరిస్థితి లేదని.. అందువల్లే జగన్మోహన్ రెడ్డి పై దాడికి ప్లాన్ చేశారని చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు తావు లేదని.. కచ్చితంగా అంతకుమించి సమాధానం మేము చెబుతామని వారు అంటున్నారు.అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటి ఉంది... ప్రజలకు ఏం చేస్తామో కూడా చెప్పగలగాలి. అలాకాకుండా సానుభూతిని నమ్ముకుంటే అన్ని రోజులు ఒకే విధంగా ఉండవు. రాజకీయాల్లో అలాంటి సంఘటనలు కోకొల్లలు జరిగాయి. అయితే ఇందులో కొంతమంది మాత్రమే విజయవంతమయ్యారు. చాలామంది ప్రజల చేత తిరస్కారానికి గురయ్యారు. సానుభూతి అనేది ఆ క్షణం వరకు పనిచేస్తుందేమో గాని.. దీర్ఘకాలం రక్షణ ఇవ్వలేదు. ఎందుకంటే చేసిన పనే చిరస్థాయిగా నిలిచిపోతుంది. అంతేతప్ప సానుభూతి కాదు. కానే కాదు.

# నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం



## -సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లు, తేదీలు సూచించారు.దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే ఆంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వైసీపీ

విజయవాడ, ఏప్రిల్ 15 సీఎం జగన్ పై రాయి దాడి ఘటనకు సంబంధించి వైసీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వెలగపూడి సచివాలయంలో ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయానికి వెళ్లిన వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మల్లాది విష్ణు, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు ఇతర నేతలు ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా సీఈసీతో.. వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మల్లాది విష్ణు సహా ఇతర నేతలు భేటీ అయ్యారు. సీఎం దాడిపై వెనుక కుట్ర కోణం ఉందని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను ఈసీకి అందించారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. 'సీఎం జగన్ పై రాయి దాడి ఘటనలో ఆయన ఎడమ కన్నుకు గాయమైంది. ఈ ఘటనను ప్రధాని మోదీ సహా.. రాజకీయాలకు అతీతంగా పలు రాష్ట్రాల నేతలు ఖండించారు. విపక్ష నేతలు దారుణంగా ప్రవర్తిస్తున్నారు. జగన్ పై దాడి ఘటనపై టీడీపీ నేతల వ్యాఖ్యలు హేయం. ఈ దాడి పథకం ప్రకారమే జరిగినట్లు స్పష్టం అవుతోంది. పదునైన వస్తువు జగన్ కంటిపై తగిలి పక్కనే ఉన్న మాజీ మంత్రి వెల్లంపల్లి కంటికి తగిలింది. కొంచెం ఉంటే వెల్లంపల్లి కన్ను పోయుండేది. ఏదైనా ఎయిర్ గన్ నుంచి షూట్ చేసినట్లు తెలుస్తోంది.' అని సజ్జల తెలిపారు. ఈ అంశాలన్నింటినీ ఈసీ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.మరోవైపు, సీఎం జగన్ పై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటికే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయగా.. దీనిపై విచారణ కోసం సీపీ కాంతి రాణా సిట్ ఏర్పాటు చేశారు. ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 20 మంది సభ్యులతో 6 ప్రత్యేక బృందాలు విచారణ చేస్తుండగా.. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం వారి నుంచి వివరాలు సేకరించనుంది. ఇప్పటికే, ఈ ఘటనకు సంబంధించి సీపీ ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించారు. స్కూల్, టెంపుల్ మధ్య బహిరంగ ప్రాంతం నుంచి రాయితో దాడి జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. అటు, ఈ ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం ఆరా తీసింది. పూర్తి వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎన్నికల సమయంలో రాజకీయ హింస పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఇటీవల చిలకలూరిపేటలోని ప్రధాని సభ, ఇప్పుడు సీఎం రోడ్ షోలో భద్రతా వైఫల్యంపై ప్రశ్నలు సంధించింది. అప్పుడు ప్రధాని సభలో భద్రతా వైఫల్యంపైనా ఆగ్రహం వ్యక్తం చేసిన సీఈసీ.. ఇప్పటికే ఐజీ, ఎస్పీలపై బదిలీ వేటు వేసింది. తాజాగా, సీఎం జగన్ రోడ్ షోలో జరిగిన ఘటనపైనా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.అటు, సీఎం జగన్ పై రాయి దాడి ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి భద్రతపై నిఘా విభాగం అప్రమత్తమైంది. గుత్తిలో జగన్ కాన్వాయ్ పై చెప్పులు.. ఇప్పుడు రాళ్లు విసరడంతో హైఅలర్ట్ ప్రకటించింది. సభల్లో ర్యాంప్ వాక్ చెయ్యొద్దని జగన్ కు భద్రతాపరమైన సూచనలు చేసింది. జగన్ బస్సు పరిసరాల్లోకి అనుమతిపై సైతం ఆంక్షలు విధించనున్నారు. 'జగన్ కు, జనానికి మధ్య బారికేడ్లు ఉండాలి. క్రేన్లు, ఆర్చులు, భారీ గజమాలలు తగ్గించాలి. జగన్ బస్సుకు వంద మీటర్ల పరిధిలో జన ప్రవేశం నిషిద్ధం విధించాలి. మరీ అవసరమైతేనే జగన్ బస్సుకు దగ్గరగా నేతలు, కార్యకర్తలను అనుమతించాలి.' అని భద్రతా సిబ్బందికి కీలక సూచనలు ఇచ్చింది. వీలైనంత వరకూ బస్ లో కూర్చునే రోడ్ షోలు నిర్వహించాలని సీఎం జగన్ కు నిఘా వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

# మృతుడు ఎగిరి కారుపై పడిన వైనం

## వాహనంపై పడిన మృత దేహంతో 18కి.మీ దూరం ప్రయాణిని

అనంతపురం,వై. కొత్తపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం దారుణ ఘటన జరిగింది. ఒక కారు డ్రైవర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో బైకు మీదున్న వ్యక్తి కారుపై పడి మృతి చెందాడు. మృతదేహం కారు మీదే వుండిపోయింది.కారు డ్రైవర్ దాదాపు 18 కిమీ దూరం ప్రయాణించాడు. వివరాలు ఇలా వున్నాయి. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన జిన్నే ఎర్రిస్వామి(35) ట్రాక్టర్ మెకానిక్. వ్యక్తిగత పనులపై పి. సిద్దరాంపురం వెళ్లి ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణం అయ్యాడు. వై. కొత్తపల్లి సమీపంలోకి రాగానే కళ్యాణదుర్గం వైపు వెళుతున్న కారు.. ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వెళ్లి ఢీకొట్టింది. దాంతో ఎర్రిస్వామి ఎగిరి కారుపైన పడిపోయాడు. గమనించని డ్రైవర్ వేగంగా కళ్యాణదుర్గం వైపు పయనం అయ్యాడు. బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి వద్ద కారుపై వ్యక్తి పడి ఉండటాన్ని వాహనదారులు గమనించి, అడ్డంగా వెళ్లి ఆపించారు. డ్రైవర్ కారును వదిలి పరార్ అయ్యాడు. కారు బెంగళూరుకు చెందినదిగా గుర్తించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

# ఆత్మకూరులో వాసవి క్లబ్ సేవలు ప్రారంభం

ఆత్మకూరు,నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో వాసవి క్లబ్ ను నూతనంగా ప్రారంభించారు. ఆర్యవైశ్యుల్లో యూనిటీని తీసుకొని రావడం వాసవి క్లబ్ యొక్క ప్రధాన ఉద్దేశం అని వాసవి క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ వీఎన్ నున్నా సంతోష్ కుమార్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో వాసవి క్లబ్ యూనిటీ ఆత్మకూరు క్లబ్ ను ఆ క్లబ్ యొక్క ఐ ఈ సి ఆఫీసర్ శబరిష్ గుప్తా, జిల్లా గవర్నర్ పేర్ల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అఫీషియల్స్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా ఆత్మకూరు ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గతంలో నిర్వహించిన వివిధ సేవా సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం వాసవి క్లబ్ యూనిటీ ఆత్మకూరు క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం చేత క్లబ్ అఫీషియల్స్ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు వాసవి క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ వీఎన్ నున్నా సంతోష్ కుమార్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా పేదలకు సేవ చేయడం, ఆర్యవైశ్యుల్లో యూనిటీని పెంపొందించడం అనేది ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ టు చైర్మన్ సాయిరాం, జోన్ చైర్మన్ సునీత, రీజియన్ సెక్రెటరీ హరిబాబు, ఆత్మకూరు వాసవి క్లబ్ జనరల్ సెక్రెటరీ మిట్టా సుధాకర్, ట్రెజరర్ డాక్టర్ మెంటా వెంకట సందీప్, వాసవి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# డి వైసీపీలోకి చేరికలు

కర్నూలుఎమ్మిగనూరుమండల పరిధిలోని అడవుల గ్రామం టిడిపి పార్టీ లో పార్టీ కార్యాలయంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంత గార్ల సమక్షంలో టిడిపి నాయకులు ఈడిగ (గౌడ్ )సంఘం జిల్లా కార్యదర్శి కడివేళ్ల ఉరుకుందుగౌడ్ తో పాటు సుదర్శన్ గౌడ్ , చిన్న రాముడు గౌడ్ , నరసప్ప గౌడ్ , బజ్జి గౌడ్ ,వీరేష్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్,నరసయ్య గౌడ్,పెద్దయ్య గౌడ్, నరసింహులు గౌడ్,విజయేంద్ర గౌడ్,రవి గౌడ్,బుసి గౌడ్ నరసింహగౌడ్ శీనప్ప గౌడ్ అంజి గౌడ్ మలకన్న, వీరితోపాటు సుమారు 300 మంది పార్టీలో చేరడం జరిగింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైస్సార్ కాంగ్రెస్ పార్టీలో పార్టీలో చేరడం జరిగింది. వీరిని శ్రీమతి బుట్టా రేణుక, బుట్టా శివ నిలకంత గార్లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# నాగలదిన్నె లో టిడిపి కార్యకర్తలు ప్రచారం

ఎమ్మిగనూరు ఏప్రిల్ 15నియోజకవర్గ పరిధిలోని నందవరం మండలంగ్రామంలో యందు విస్తృతంగా పర్యటించి గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకొని అధికార వైసిపి పార్టీ 5 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసిన మోసాలన్ని ఒక్కొక్కటిగా వివరిస్తూ రాబోవు రోజులలో ఉమ్మడి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత చేపట్టబోయే సూపర్ 6 పథకాలను గురించి ప్రజలకు వివరిస్తూ, సైకో పోవాలి అంటే మళ్లీ సైకిల్ రావాలని రాబోవు ఎన్నికలలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఉమ్మడి తెలుగదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డా బి వి జయనాగేశ్వర రెడ్డి గారికి అలాగే కర్నూల్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు సైకిల్ గుర్తుకు అమూల్యమైన ఓటును వేసి వేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్దించారు..

# జగన్ కేసు దర్యాప్తు ముమ్మరం

విజయవాడ, ఏప్రిల్ 15 తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సీఎం జగన్పై గులకరాయి దాడి కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నలుగురు అనుమానితులను తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. వారిని రహస్య ప్రదేశంలో ప్రశ్నిస్తున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. విజయవాడలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం చేస్తున్న టైంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గులకరాళ్లతో దాడి చేశారు. ఈ రాయి తగిలి ఆయన నుదిటిపై గాయమైంది. దీనిపై అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్లో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఐపీసీ సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు కట్టిన పోలీసులు ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు విజయవాడ పశ్చిమ డీసీపీ హరికృష్ణ ఆధ్వర్యంలో 20 మందితో సిట్ వేశారు. ఇందులో ఆరు టీంలు పని చేస్తున్నాయి. వీళ్లంతా ఆధారాల కోసం అన్వేషిస్తున్నాయి. ఎటు నుంచి దాడి జరిగింది. ఎంత దూరంలో ఉండి ఎటాక్ చేశారనే కోణంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడకు వచ్చిన జనం తీసిన వీడియోలను కూడా పరిశీస్తున్నారు. వీళ్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది.అనుమానితులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నపోలీసులు కేసు దర్యాప్తు రెండు మూడు రోజుల్లో కొలిక్కి వస్తుందని చెబుతున్నారు. అదుపులో ఉన్న నిందితుల్లో రౌడీషీటర్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. దాడి జరిగిన ప్రాంతంలోని అన్ని చోట్ల ఉన్న సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలిస్తున్నారు. దాడి జరిగిన టైంలో కరెంటు లేకపోవడం దర్యాప్తుకు ప్రధాన అడ్డంకిగా మారిందంటున్నారు పోలీసులు. రోడ్షో జరిగిన ప్రాంతంలో ఉన్న పాఠశాల నుంచే రాయి విసిరినట్టు నిర్దారించిన పోలీసులు అక్కడ ఉన్న వారిపై ఆరా తీస్తున్నారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం



బిక్కవోలు శ్రీ ప్రస్థానం ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలబద్రపురం గ్రామంలో ధవలేశ్వరం సామర్లకోట కెనాల్ గట్టు ప్రక్కన ఉన్న తుప్పలలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన బిక్కవోలు పోలీసులు ఈ సందర్భంగా ఎస్సై బుజ్జి బాబు మాట్లాడుతూ స్థానికుల సమాచారంతో బలబద్రపురం కెనాల్ గట్టు తుప్పల్లో ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడని మృతదేహం మొత్తం కుళ్ళిపోయి ఉన్నదని. మొహం కూడా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నదని. ఒంటిమీద చొక్కా లేదు ఫ్యాంట్ మాత్రమే ఉన్నదని. కుడి చేతికి ఎరుపుతాడు ఉన్నదని. వయస్సు సుమారు 25 నుండి 35 సంవత్సరాలు మధ్యలో ఉంటుందని. సదరు మృతదేహాన్ని గుర్తుపట్టిన యెడల బిక్కవోలు పోలీసు వారికి 9440904851,08857236433 నంబర్స్ కి తెలియపరచవలెనని అయన కొరారు

# ఎన్నికల తనిఖీలో వెండి ఆభరణాలు సీజ్.

వెండి ఆభరణాలను సీజ్ చేస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి. సిబ్బంది.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మన రాష్ట్రంలో మే 13 వ తారీకున జరగనున్న అసెంబ్లీ, శాసనసభ ఎన్నికల నియమావళి లో భాగంగా పోలీసుల తనిఖీల్లో వెండి ఆభరణాలు దొరకగా వాటిని పోలీసులు సీజ్ చేశారు. వివరాల్లోకెళితే సోమవారం ఎస్సై నిరంజన్ రెడ్డి తమ సిబ్బందితో రుద్రవరం, నరసాపురం మార్గమధ్యలో తనిఖీలు నిర్వహిస్తుండగా రుద్రవరం సమీపంలోని పెట్రోల్ బంకు దగ్గర టీవీఎస్ బైక్ తనిఖీ చేయగా అందులో ఎటువంటి రసీదులు లేకుండా 45 జతల వెండి పట్టీలను చాగలమర్రి కి చెందిన షేక్ అబ్దుల్లా అనే వ్యక్తి తీసుకొని వెళుండగా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వాటిని తూకం వేయగా 3 కేజీల 150 గ్రాముల తూకము ఉన్నాయన్నారు. వీటిని వీఆర్వో వెంకటరమణ, పంచాయతీ సిబ్బంది సమక్షంలో పంచనామ నిర్వహించి నంద్యాలలోని ట్రెజరీ కార్యాలయంలో అప్పగించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

# నిర్మల దృఢ సంకల్పం, పోరాట పటిమ కు సెల్యూట్

ఆడపిల్లలకు నిర్మల రోల్ మోడల్,స్ఫూర్తి ప్రదాత

ఎక్కడైనా విద్యార్థినీ విద్యార్థులు చదువును మధ్యలో ఆపేసి ఇంట్లో ఉంటే వెంటనే ఈ సంవత్సరం కళాశాలలో అడ్మిట్ చేయండి జిల్లా కలెక్టర్ డా జి.సృజన

కర్నూలు, ఏప్రిల్ 14:- నిర్మల పోరాట యోధురాలు అని, ఆ అమ్మాయి దృఢ సంకల్పం, ఉక్కు హృదయం, పోరాట పటిమ కు సెల్యూట్ అని జిల్లా కలెక్టర్ డా జి.సృజన ప్రశంసించారు..ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన నిర్మల 10 వ తరగతిలో మంచి మార్కులు సాధించినప్పటికీ, పేదరికంతో తలిదండ్రులు చదువు మాన్పించిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్మలను ఆస్పరి మండలం కేజీబీవీ కళాశాలలో చేర్పించిన నేపథ్యంలో నిర్మల ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షల్లో 440 మార్కులకు గాను 421 మార్కులు సాధించి జిల్లాలో టాపర్ గా నిలిచిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదివారం నిర్మల ను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు.×ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం లో జిల్లాలో టాపర్ గా నిలిచిందన్నారు.. జిల్లాలో బైపీసీ ఉన్న 8 కేజీబీవీ కళాశాలల్లో ఆస్పరి మండలం కేజీబీవీ కళాశాల్లో ఇంటర్మీడియట్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న నిర్మల వార్షిక పరీక్షల్లో టాపర్ గా నిలిచిందన్నారు.. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన హనుమంతమ్మ , శ్రీనివాస్ దంపతుల కుమార్తె నిర్మల గురించి నేడు దేశం మొత్తం చర్చిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. .. ఆడపిల్లలకు నిర్మల రోల్ మోడల్,స్ఫూర్తి ప్రదాత అని కలెక్టర్ ప్రశంసించారు. ఎన్ని ప్రతిఘటన లు ఎదురైనప్పటికీ, ఉక్కు హృదయంతో, దృఢ సంకల్పంతో చదువుకోవాలన్న తన కోరికను నెరవేర్చుకుని ఉన్నత ఆశయంతో ముందుకు వెళుతోందని కలెక్టర్ కొనియాడారు... విద్య తోనే సాధికారత లభించగలదని, ఆడపిల్లలు చదువుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. బేటి బచావో బేటి పడావో కింద నిర్మలకు ఇన్సెంటివ్ ఇవ్వాలని కలెక్టర్ ఇంచార్జ్ ఐసిడిఎస్ పిడి అధికారిని ఆదేశించారు...విద్యార్థిని ఖాతాలో ఇన్సెంటివ్ జ చేయడం వల్ల ఇంటర్మీడియట్ తదనంతరం వారి తల్లితండ్రుల మీద ఆర్థిక భారం లేకుండా నిర్మలకు పై చదువులు చదవడానికి ఉపయోగపడుతుందన్నారు. సమస్యల వల్ల చదువుకోలేక మధ్యలో చదువు ఆపేసిన వారు ఇంకా ఎవరైనా ఉంటే స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించి, అలాంటి వారిని ఈ సంవత్సరం కేజీబీవీ కళాశాలలో అడ్మిషన్ చేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు...నిర్మల సాధించిన ప్రగతి గురించి అందరికీ తెలిసేలా సమావేశం నిర్వహించేందుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో స్వీప్....!

ఎక్స్‌క్యూజ్ మీ మేడం తమరు పర్మిషన్ ఇస్తే!

స్వీప్ మీద మాట్లాడతాను అన్న డీపీఓ....!

ఓటింగ్ శాతం పెరగాలి, ఏథికల్ ఓటింగ్ జరగాలన్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్....!

ఏప్రిల్ 15 ఏలూరు (ప్రస్థానం న్యూస్) జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘం సమావేశం జడ్పీ ఛైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. సమావేశానికి హాజరైన అధికారులు ఎన్నికల ప్రవర్తన నియామవాళిని దృష్టిలో ఉంచుకొని శాఖల వారీగా ప్రగతి నివేదిక వివరించారు. ఎలక్షన్ మోడల్ కోడ్ ఉన్నందున ఎటువంటి విధాన పరమైన నిర్ణయాలు తీసుకోకుండానే సమావేశం ముగించారు. మొదటి స్థాయి సంఘం ప్రణాళిక, ఆర్థిక అంశాలపై జరుపగా వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి ఎద్దడిపై జిల్లా యంత్రంగం తీసుకున్న ముందస్తు చర్యలపై అధికారులు స్థాయి సంఘం సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగిస్తూ ఛైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలపగ సమావేశానికి హాజరైన



అధికారులు వెళ్ళడానికి సిద్ధపడగా అంతలో ఎక్స్‌క్యూజ్ మీ మేడం.. తమరు పర్మిషన్ ఇస్తే! అని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ జడ్పీ ఛైర్పర్సన్ ఉద్దేశించి అనుమతి కోరగా అదేస్థాయిలో 'ఎస్ ప్లీజ్' అని బదులు రావడంతో అధికారులు అందరు ఏమిటా అని డీపీఓ వైపు చూడగా తాను జిల్లా స్వీప్ నోడల్ ఆఫీసర్ అని జిల్లాలో ఇప్పటివరకు 2000 స్వీప్ కార్యక్రమాలు పట్టణాలలో, గ్రామాలలో చేపట్టడం జరిగిందన్నారు. సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ గత ఎన్నికలలో జిల్లా పోలింగ్ శాతం 83.10% అని రాబోవు సార్వత్రిక ఎన్నికలలో 92% లక్ష్యం పెట్టుకొని ఓటింగ్ పెంచే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారికీ, దివ్యంగుల కోసం ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు హోమ్ ఓటింగ్ జరుపనున్నామని అన్నారు. జిల్లాలో అత్యల్పంగా 68.54% పోలింగ్ నమోదు గత ఎన్నికలలో ఏలూరు నియోజకవర్గంలో జరిగిందని దీనికి ప్రధాన కారణం ఈ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైన వారు ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేయడం, చదువులు నిమిత్తం దూర ప్రాంతాలలో ఉండడం వలన పోలింగ్ రోజు ఓటుహక్కు వినియోగించుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ద్వారా జరుగుతుందని, సమాజ అభివృద్ధికి, వ్యక్తి భవిషత్తుకు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పవిత్రమైన ఓటును నగదుకు, బహుమతులకు అమ్ముకోకూడదని ప్రతి ఓటరు ఏథికల్ ఓటింగులో భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లాలో ఉన్న 16.25 లక్షల ఓటర్లను దృష్టిలో ఉంచుకొని ఓటరు చైతన్య కార్యక్రమాలలో భాగంగా అన్ని పంచాయతీలలో కళాజాత కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు దూరప్రాంతాలలో ఉన్న ఓటర్లకు అమ్మ పిలుస్తుంది అనే సామజిక చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆహ్వానపత్రిక పంపి ఓటింగు ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుబ్బారావు, జిల్లాస్థాయి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు ఉన్నారు.

# కార్యేషు దాసి.. కరణేషు మంత్రి పదాలకు మాటలతో కాక చేతలతో అర్థం చెప్పిన మహాలక్ష్మి.



జండా చిరగలేదు దురుసు మాటలు రాలేదు .

ప్రత్యర్ధుల కుటిల రాజకీయాలపై గెలిచిన నల్లమిల్లి కుటుంబం



బిక్కవోలు శ్రీ ప్రస్థానం ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే గా గెలవడం అంటేనే ఒక ప్రత్యేకత అక్కడ ఏది గెలిస్తే రాష్ట్రం లో అదే పార్టీ పరిపాలన చేస్తుంది అనే నానుడి కూడా ఉంది అందుకే రాష్ట్రం మొత్తం అనపర్తి నియోజకవర్గం వైపే చూడటం విశేషం ముద్దుగా అనపర్తి నియోజకవర్గాన్ని రెండవ పులివెందల అని కూడా అంటారు అయితే మొదటి పులివెందల రాజకీయం ఎలా ఉంటుందో తెలియదు గానీ ఇక్కడ రాజకీయమాత్రం కుటిల రాజకీయంగా మారింది అనడంలో సందేహం లేదు. ఎవరికి తోచిన విధంగా వారు రాజకీయం చేయడం ఆనవాయితీ కానీ ఇక్కడ మాత్రం చాలా విచిత్రమైన రాజకీయాలు జరుగుతాయి అందులో భాగమే ఎన్ డి ఏ కూటమిలో భాగంగా బిజెపికి టిక్కెట్ కేటాయించడం. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి టిక్కటిస్తున్నట్టు మొదటి జాబితాలో ప్రకటించగా అనంతరం ఎన్డీఏ కూటమి కింద బిజెపికి టిక్కట్టుస్తున్నట్టు ప్రకటించడం జరిగింది. ఆ నేపథ్యంలో నల్లమిల్లి కుటుంబం తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్లి ప్రజల్ని న్యాయం కోరడం జరిగింది ప్రజలు కూడా పార్టీలకతీతంగా రామకృష్ణారెడ్డికి మద్దతు ప్రకటించడంతో ఎన్డీఏ కూటమి ఆలోచనలో పడి రామకృష్ణారెడ్డికి అనుకూలంగా మారడంతో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయానికి రామవరం తన సొంత ఇంటి నుండి ఆలయం వరకు కాలినడకన వచ్చి ముక్కు తీర్చుకుంటానని మొక్కుకోవడంతో సోమవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహాలక్ష్మి రామవరం నుండి కొప్పవరం కొమరిపాలెం పందలపాక, పూలపల్లి గ్రామాల మీదగా బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయానికి చేరుకోగా గ్రామ గ్రామాన మహాలక్ష్మికి ఘన స్వాగతం లభించింది స్వేచ్ఛాందంగా ప్రతి గ్రామంలోనూ సామాన్య ప్రజలు రోడ్డుపై కొచ్చి స్వాగతం పలికారు ఊలపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఉన్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడనుండి బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 డిసెంబర్ 23 వ తారీఖున ప్రమాణం చేసిన పిదప ఆంధ్ర రాష్ట్రంలోనే కాక యావత్ తెలుగు ప్రజలున్న ప్రతి ఒక్కరికి అనపర్తి నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ గురించి తెలిసిందని అందులో భాగంగానే తనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పదవి కూడా లభించిందని నా ప్రమాణంలో అన్యాయం ఉంటే ఆ రోజే నేను శిక్ష అనుభవించి ఉండేవాడినని అప్పుడు న్యాయం చేసి ఇప్పుడు టిక్కెట్ రాకుండా లక్ష్మి గణపతి స్వామి వారు ఎలా అన్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈరోజు అనుకూల పరిస్థితులు ఏ విధంగా ఏర్పడతాయని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని ప్రజలు ప్రత్యర్థులు కుట్ర చేసి ఆయనకు ప్రకటించిన అభ్యర్థిత్వం పోయేలా చేసారని అయినా సరే నల్లమిల్లి జండా చింపలేదు లేదు, దురుసు మాటలు మాట్లాడలేదు, పార్టీని నిర్వీర్యం చేయలేదు ప్రజాభిప్రాయానికి వెళ్లి తన బలం ఏంటో నిరూపించుకున్నాడని నియోజకవర్గంలోని ప్రజలు శభాష్ అంటున్నారు. లక్ష్మి గణపతి స్వామి వారి మోక్కు తీర్చడంతో మహాలక్ష్మిని నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తగిన భార్య అంటూ పలువురు ప్రశంసిస్తున్నారు.ఆమె భర్తకు చేదోడుగా నిలిచి ప్రజలతో బాటు ఇష్టదైవం బిక్కవోలు లక్ష్మిగణపతిని నమ్ముకుందని ఆయనను ప్రజలు దీవించారని ఆమెను లక్ష్మిగణపతి కరుణించాడని పోయిన అభ్యర్థిత్వం తిరిగి దక్కిందని. కూటమి అభ్యర్థిగా ఆయన వైపే టిడిపి-బిజెపి-జనసేన అధినేతలు మొగ్గుచూపారని మొక్కిన మొక్కులు చెల్లించేందుకు నేడు ఆమె రామవరం నుండి బిక్కవోలు లక్ష్మిగణపతి ఆలయానికి కాలినడకన వెళ్ళి స్వామి వారికి మొక్కవోని దీక్షతో లక్ష్మిగణపతి ఆలయానికి చేరుకుని స్వామి వారికి భక్తి శ్రద్ధలతో మొక్కు చెల్లించుకున్నారని కార్యేషు దాసి.. కరణేషు మంత్రి అనే పదాలు నిజమైన అర్థం తెచ్చారని ప్రజలు ప్రశంసలు కురిపించారు

# వైడిపిని వీడి తెలుగుదేశం పార్టీ లో చేరిన ఎంపిటిసి. కె.మహబూబ్ బాషా...

దొర్నిపాడు, ఏప్రిల్:15, శ్రీ ప్రస్థానం న్యూస్ :- నంద్యాల జిల్లా దొర్ని పాడు మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ కట్టుబడి మహబూబ్ బాషా, వైసిపి నీ వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు..సోమవారం నాడు దొర్నిపాడు మాజీ మండలాధ్యక్షులు భూమా బ్రహ్మానందరెడ్డి, ఆధ్వర్యంలో కట్టుబడి మహబూబ్ బాషా, తో పాటు సుమారు 60 కుటుంబాలకు పైగా వైసిపి కి చెందిన ముస్లిం మైనార్టీకి నాయకులు మాజీ మంత్రి



ఆళ్లగడ్డ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిల ప్రియ, భార్గవ రామ్ ల దంపతులతో పాటు భూమా జగత్ విఖ్యాత రెడ్డి, ల సమక్షంలో స్థానిక టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు.. వీరందరికి కూడా భూమా అఖిల ప్రియ,పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు... ఈ సందర్భంగా భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపే ధ్యేయంగా చేసుకొని కలిసి కట్టుగా పనిచేద్దాం అని ఆమె అన్నారు .. తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎంపిటిసి.. మాట్లాడుతూ వైసిపి చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకనే స్వచ్ఛంద గానే ముందుకు వచ్చి తెలుగు దేశం పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.. రాష్ట్రంలోనీ నిరుద్యోగ యువతీ యువకుల భవిష్యత్ బాగుపడాలన్నా సుపరిపాలన అందించాలన్నా టిడిపి జాతీయ అద్యక్షులు మాజీ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు, తోనే సాధ్యం అని నమ్మి టిడిపి లో చేరడం జరిగిందన్నారు.. నియోజక వర్గ టిడిపి అభ్యర్థి భూమా అఖిల ప్రియ ను బారీ మెజార్టీ తో గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు... వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడి టిడిపి జనసేన, బి జే పీ. ఉమ్మడి నాయకత్వాన టిడిపి విజయం సాధించేలా ప్రతి ఒక్క కార్యకర్తను కలుపు కొని పనిచేస్తామని పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులూ ఏర్వ ప్రసాద్ రెడ్డి, మహేశ్వర రెడ్డి,గ్రామ టిడిపి నాయకులు బుచ్చయ్య గారి వెంకట్రామిరెడ్డి,కట్టుబడి అబ్దుల్ రహీం, పెట్నికోట బాషా, ఎం. బాష, కె . బాబా పకృద్దిన్, బి. చిన్న మహమ్మద్, టి.వలి, కుంట కట్ట మాబాష, కె. చిన్న బాషు, కె.సి.ఎం. బాషా, కె.మహబూబ్ దౌల, ఎం.పక్రుద్దిన్, తదితరులు పాల్గొన్నారు...

# ఏపీ మోడల్ పాఠశాలలోఏప్రిల్ 21 న ప్రవేశ పరీక్ష..

హాల్ టికెట్లు విడుదల. ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు.






నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-ఆదర్శ పాఠశాల రుద్రవరం, వచ్చే విద్యాసంవత్సరం (2024-25) 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశపరీక్ష హాల్‌టికెట్లు విడుదలయ్యాయి అని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారిక వెబ్‌సైట్‌లో(లిలిలి.జీజూఎబ.జీజూఇటబబ.ఐనీల.తిని) హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులు తమ ఐడీ, పుట్టిన తేదీ వివరాలు, వెరిఫికేషన్ కోడ్ వివరాలు నమోదుచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని అన్నారు. ప్రవేశ పరీక్ష లో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు అని అన్నారు.ఇంతకు ముందు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 21న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 వరకు ఆదర్శ పాఠశాల రుద్రవరం యందు 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు/ ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష ఉంటుంది అని అన్నారు. మోడల్ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే బోధిస్తారు, బాగా చదువుకోవడానికి విద్యార్థులకి, తల్లిదండ్రులు కి మంచి సౌకర్యం ఉంటుంది అని అన్నారు.స్కూల్ సీబీఎస్ఈకి అనుబంధంగా ఉన్నది అని అన్నారు.తెలుగు/ ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రశ్నలు ఉంటాయి అని అన్నారు.పరీక్ష విధానం: మొత్తం 100 మార్కులకు రాతపరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలోనే ప్రశ్నలు ఉంటాయి. 5వ తరగతి స్థాయిలోనే ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో అర్హత మార్కులకు ఓసీ, బీసీ విద్యార్థులకు 35గా; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30గా నిర్ణయించారు.

# గడ్డివాములు దగ్ధం.


మంటలలో కాలుతున్న గడ్డి వామును ఆర్పుతున్న గ్రామస్తులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని ఎల్లావత్తుల గ్రామంలో రూ 2 లక్షల విలువ చేసే రెండు గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు గ్రామానికి చెందిన పెద్ది హరి, పాణ్యం శీను అనే రైతులకు చెందిన పశుగ్రాసము గ్రామ సమీపంలో నిలువ ఉంచారన్నారు. విద్యుత్ ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పశుగ్రాసమంతా పూర్తిగా దగ్ధమైందన్నారు. దీంతో రైతులు తమ పశువుల కోసము నిలువ ఉంచిన పశుగ్రాసమంతా పూర్తిగా దగ్ధం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశుగ్రాసం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వము తగిన ఆర్థిక సహాయం అందించాలని రైతులు కోరారు.

# ప్రపంచ మేధావి టతీ బి ఆర్ అంబేద్కర్ గారు 133వ జన్మ దిన వేడుకలు.

ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయం లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 133వ జయంతి సందర్భంగా సభ్యులందరూ అంబేద్కర్ గారి విగ్రహం దగ్గరికి పోయి పూలమాల వేసి జై భీమ్ అనే స్లొగన్స్ ఇచ్చి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరిగినది. ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం గారు మాట్లాడుతూ అంబేద్కర్ గారు ప్రపంచ మేధావులలో ఒకరుగా పరిగణించి ఐక్యరాజ్యసమితి ఏప్రిల్ 14 వ తారీకును ప్రపంచ విజ్ఞాన దినోత్సవం గా ప్రకటించింది. దళిత జాతిలో పుట్టి బడికి దూరంగా గుడికి వెలపల జీవనాన్ని సాగించిన మహానుభావునికి కుల వివక్ష ఎదురైన సందర్భాలు కోకోలలు. బడుగులను ఎస్సీ ,ఎస్టీ, బీసీ, వర్గాల అభ్యున్నతి కొరకు ఎన్నో పోరాటాలు చేసి భారత రాజ్యాంగాన్ని రచించి భారత ఉపఖండానికి భారతరత్న రాజ్యాంగ పితామహుడుగా పేరుందినారు, అంబేద్కర్ గారు అనుసరించిన జీవిత విధానము ఎంతోమంది మహానుభావులను ప్రేరేపితం చేసింది. జై రాజ్యాంగ పితామహుడు, జై భీమ్ జై జై భీమ్ అని నినాదాలు చేస్తూ ఘనంగా జరపడం జరిగినది. ఇందులో గౌరవాధ్యక్షులు ప్రజా పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు పద్మా నంద యోగీ గారు , డేవిడ్, శివ కల్లూరు వెంకటేశ్వర్లు, బ్రహ్మ, భైరవ, నరసింహా, సూరి ,శివమణి ఈశ్వర్,చంద్ర ,రవి కుమార్ రెడ్డి, కుమార్, బిల్లా, రంగ, పురుషోత్తమ, వాసుదేవ ,వెంకట్రాం రెడ్డి పార్టీలు గారు, కృష్ణయ్య గారు, ప్రజా పరిరక్షణ సమితి నాయకులు,కార్యకర్తలతో పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757